క్లుప్తంగా

నీతి కథలతో మానసిక వికాసం



విద్యార్థులతో నీతి కథలను చెప్పిస్తున్న గ్రంథపాలకురాలు పద్మావతి

కె.కోటపాడు: విద్యార్థులు నీతి కథల్లో మంచిని గ్రహించాలని గ్రంథపాలకురాలు ఎం.పద్మావతి తెలిపారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం చౌడువాడ శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు నీతి కథల పుస్తకాలను చదివించడంతో మానసిక వికాసం కలుగుతుందన్నారు. చదువుకు ప్రాధాన్యమివ్వడంతోపాటు క్రీడలపైనా ఆసక్తి కనబరచాలని సూచించారు. బాస్కెట్ బాల్ పోటీలను నిర్వహించారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు

మాడుగుల రూరల్: చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. శనివారం కె.జె.పురం, కింతలి పీహెచ్‌సీ పరిధి ఆరోగ్య ఉప కేంద్రాల్లో ఆశ, ఆరోగ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు సారథ్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఐదు ప్రాణాంతకరమైన వ్యాధులు దరిచేరకుండా ఈ టీకాలు వేసినట్లు వైద్యాధికారులు ప్రసాదుపాత్రుడు, కె.ఎం. నాయుడు తెలిపారు.

పాలిసెట్ ఫలితాల్లో ప్రతిభ



జ్యోతిక



జశ్వంత్

రావికమతం: రాష్ట్ర ప్రభుత్వం శనివారం విడుదల చేసిన పాలిసెట్ ఫలితాల్లో మండలంలోని గుడ్డిప గ్రామానికి చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. విద్యార్థిని తోట జ్యోతిక 1,019, విద్యార్థి జోగ జశ్వంత్ 1,864 ర్యాంకులు సాధించారు. జ్యోతిక అచ్యుతాపురం గురుకుల పాఠశాలలోని పదో తరగతిలో 562 మార్కులు, జశ్వంత్ రావికమతం హైస్కూల్‌లో చదివి 539 మార్కులు పొందారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఇంతటి ఘనత సాధించిన ఈ మట్టిలో మాణిక్యాలను సర్పంచ్ గమ్మాల గణేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేయాలని వినతి

బుచ్చెయ్యపేట: అనకాపల్లి నుంచి బుచ్చెయ్యపేట, వడ్డాది జంక్షన్ మీదగా పాడేరుకు ఆర్టీసీ బస్సు నడపాలని మండల అభివృద్ధి పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు, న్యాయవాది చొప్పా బాబూరావు కోరారు. శనివారం ఆయన ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీని కలిసి వినతిపత్రం అందించారు. విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ బస్సు నడపాలన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన



అటవీ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న రేంజర్ లక్ష్మీనర్సు

నర్సీపట్నం: పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని రేంజర్ లక్ష్మీనర్సు అన్నారు. శనివారం లైఫ్‌స్టైల్ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్(లైఫ్) కార్యక్రమంలో భాగంగా కలప డిపో, బలిఘట్టం చెక్‌పోస్టు, నీలంపేట అటవీశాఖ సిబ్బంది అవగాహన కల్పించారు. అడవుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. నీటిని, విద్యుత్తును పొదుపుగా వినియోగించాలన్నారు. పర్యావరణ సమతుల్యతకు విధిగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ కె.వి.రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి మోదమాంబ మహోత్సవాలు

రావికమతం: టి.అర్జాపురంతోపాటు ఆరు గిరిజన గ్రామాల ప్రజల ఆరాధ్య దైవం గదబపాలెం మోదమాంబ 17వ వార్షికోత్సవ మహోత్సవాలు ఈ నెల 21, 22, 23 తేదీల్లో నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ మడగల పాల్గుణ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల, కబడ్డీ పోటీలు నిర్వహించి, విజేతలకు నగదు బహుమతులు అందిస్తామన్నారు. వీటితోపాటు ఆరోజు గదబపాలెం, టి.అర్జాపురం గ్రామాల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు, భారీ లైటింగ్, బాణసంచా ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ఎల్. పొన్నవోలు.. మారిన రూపురేఖలు

- రూ.3.44 కోట్లతో అభివృద్ధి పనులు
- తొలగిన తాగునీటి, రవాణా కష్టాలు
- ఆనందంలో ఆరు గ్రామాల ప్రజలు



ఎల్.పొన్నవోలులో ఏర్పాటు చేసిన సీసీరోడ్డు



నాడు - నేడుతో కార్పొరేట్‌కు దీటుగా ముస్తాబైన పాఠశాల భవనం



గ్రామానికి ఏర్పాటు చేసిన పక్కారోడ్డు



నిర్మాణంలో మంచినీటి పథకం



ప్రారంభానికి సిద్ధంగా సచివాలయ భవనం

మాడుగుల: ఒకప్పుడు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న ఎల్.పొన్నవోలు పంచాయతీ రూపురేఖలు మారాయి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక పంచాయతీ స్వరూపమే మారింది. నాడు - నేడు నిధులతో కార్పొరేట్ దీటుగా పాఠశాల భవనాలు పూర్తికాగా, గతుకుల రోడ్ల ప్రయాణ కష్టాల నుంచి బీటీరోడ్డుపై హాయిగా రాకపోకలు సాగిస్తున్నారు. ఈ విధంగా రూ 3.44 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులు చివరి దశల్లో ఉన్నాయి.

ఎల్.పొన్నవోలు పంచాయతీలో నరసయ్యపేట, ఒండ్రువీధి, ఎల్.కె.గదబవీధి, ఎల్.కృష్ణాపురం, ఒంటిమామిడిపాలెం గ్రామాల్లో అత్యధికంగా గిరిజనులు జీవనం సాగిస్తుంటారు. వీరు వేసవిలో తాగునీటికి కటకటలాడేవారు. ఎక్కడ చూసినా మొరాయించే బోర్లు దర్శనమిచ్చేవి. ఈ నేపథ్యంలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే గిరిజన గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించారు. దాంతో తాగునీటి పరిష్కారానికి ఇంటింటికీ కుళాయిలు, ఇతర అభివృద్ధి పనులు చేయడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పంచాయతీ -	ఎల్.పొన్నవోలు
గ్రామాలు -	6
జనాభా -	2,600
ఓటర్లు -	1,450
వార్డులు -	10

పంచాయతీలో అభివృద్ధి పనులు..

- రూ.83 లక్షలతో గ్రామ సచివాలయం, ఆర్‌బీకే, వెల్‌నెస్ కేంద్రాల భవనాలు నిర్మిస్తున్నారు. సచివాలయం పూర్తికాగా, మిగిలినవి పనులు చివరి దశలో ఉన్నాయి.
- జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.1.18 కోట్లతో ఎల్.పొన్నవోలు, ఒంటిమామిడిపాలెం గ్రామాల్లో ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు పనులు జోరుగా సాగుతున్నాయి.
- నాడు – నేడులో భాగంగా రూ.54 లక్షలతో నరసయ్యపేట, ఎల్.పొన్నవోలు, ఎల్.కృష్ణాపురంలో అదనపు భవనాల పనులు దాదాపు పూర్తి కావస్తున్నాయి.
- రూ.24 లక్షలతో రెండు అంగన్‌వాడీ భవనాల పనులు చివరి దశలో ఉన్నాయి.
- గ్రామానికి రూ.60 లక్షలతో పక్కారోడ్డు నిర్మించారు. రూ.15 లక్షలతో సీసీరోడ్లు పూర్తి చేశారు.
- రూ.3 లక్షలతో పబ్లిక్ టాయిలెట్ల పనులు పూర్తయ్యాయి.

సొంతింటి కల నెరవేరింది



ముగ్గురు పిల్లలను చదివించలేని స్థితిలో జగనన్న అధికారంలోకి రాగానే అమ్మఒడితో ఆదుకున్నారు. పూరింటిలో ఉన్న నాకు సొంతింటి కల నెరవేర్చారు. ఇల్లు నిర్మించుకుంటున్నా. దూర ప్రాంతాలకు తాగునీటి కోసం వెళ్లకుండా రెండు మంచినీటి పథకాలు మంజూరు చేశారు.

– మంచిపల్లి ఈశ్వరమ్మ, గిరి మహిళ, ఒంటిమామిడి పాలెం

కోట్లాది రూపాయలతో అభివృద్ధి



డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సహకారంతో పంచాయతీని కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేస్తున్నాం. ఇప్పటికే చాలావరకు పనులు పూర్తయ్యాయి. మరికొన్ని చివరి దశలో ఉన్నాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, డిప్యూటీ సీఎంకు గ్రామస్తుల తరపున కృతజ్ఞతలు చెబుతున్నా.

– వేగేసిన ప్రభాకరరాజు, సర్పంచ్, ఎల్.పొన్నవోలు

అయ్యన్నపాత్రుడిది అవగాహన రాహిత్యం

- నర్సీపట్నం ఎమ్మెల్యే గణేష్



నర్సీపట్నం: పేదల జీవనోపాధి కోసం ప్రవేశ పెట్టిన ఉపాధి హామీ పథకాన్ని రాజకీయం చేయటం మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడికి తగదని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి పనులపై అయ్యన్న చేసిన ఆరోపణలను ఎమ్మెల్యే తిప్పికొట్టారు. ఆరుసార్లు మంత్రిగా వెలగబెట్టిన తను పాత జీవోను పట్టుకుని అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారని విమర్శించారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఉపాధి నిధులు దుర్వినియోగానికి పాల్పడటంతో కేంద్ర ప్రభుత్వం ఎన్‌ఐసీ సిస్టమ్ ద్వారా పర్యవేక్షిస్తుందన్నారు. ఇదంతా అయ్యన్నపాత్రుడికి తెలిసీ ఉపాధి కూలీలను రెచ్చగొట్టడం విడ్డూరంగా ఉందన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఉపాధి పనులను రాజకీయం చేయటం తగదన్నారు. లక్ష్మి అనే వేతనదారు 16 రోజులు పని చేస్తే ఆమె ఖాతాలో రూ.4,689 పడ్డాయి. ఈ లెక్కన ఆమె రోజుకు రూ.289 వేతన తీసుకుందన్నారు. రెడ్డి అమ్మాజీకి 18 రోజులకు రూ.5,314 పడ్డాయి. ఆమె రోజుకు రూ.298 వేతనం పొందిందన్నారు. ఈ వాస్తవాలు తెలుసుకోకుండా రోజుకు రూ.150కు మించి వేతనాలు చెల్లించటం లేదని ప్రభుత్వంపై విమర్శలు చేయటం హాస్యాస్పదంగా ఉందన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క ఏడాది హెరిటేజ్ మజ్జి ప్యాకెట్లు పంపిణీ చేసి, మిగిలిన నాలుగేళ్లు పంపిణీ చేసినట్లు చూపించి ఉపాధి నిధులు కాజేశారని దుయ్యబట్టారు. ఉపాధి నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో ఉన్నప్పుడు అక్కడ ఉన్న పరిస్థితులను బట్టి కూలీలకు సౌకర్యాలు కల్పించుకునేందుకు అవకాశం ఉండేదన్నారు. టీడీపీ తప్పుడు విధానాలతో పథకం రాష్ట్ర ప్రభుత్వ పర్యవేక్షణలో లేకుండా పోయిందన్నారు. ఇవన్నీ తెలిసీ రాజకీయ లబ్ధి కోసం విమర్శలు చేయడం సరికాదన్నారు.

ఈవోపీఆర్డీని ప్రభుత్వానికి సరెండర్ చేయాలి

- లేదంటే మూకుమ్మడి రాజీనామాలు చేస్తామన్న సర్పంచ్‌లు



ఈవోపీఆర్డీ ధోరణిపై అసహనం వ్యక్తం చేస్తున్న సర్పంచ్ బూరె బాబూరావు

దేవరాపల్లి: విధి నిర్వహణలో పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్న మండల పంచాయతీ విస్తరణాధికారి (ఈవోపీఆర్డీ) కె.ఉషశ్రీపై పలు గ్రామాల సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. పది రోజుల్లో ఆమెను ప్రభుత్వానికి సరెండర్ చేయకుంటే మూకుమ్మడి రాజీనామాలు చేస్తామని హెచ్చరించారు. ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి అధ్యక్షతన శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఈవోపీఆర్డీ వైఖరిని వారంతా ఎండగట్టారు. ముందుగా బోయిలకింతాడ సర్పంచ్ బూరె బాబూరావు ప్రస్తావించగా, ఏ.కొత్తపల్లి, వెంకటరాజుపురం, కొత్తపెంట సర్పంచ్‌లు చింతల సత్య వెంకటరమణ, దాసరి సంతోష్‌కుమార్, రొంగలి వెంకటరావు తదితరులు వంతపాడారు. దీనిపై ఎంపీపీ రాజేశ్వరి స్పందించి ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి సమక్షంలో చర్చించి తగు చర్యలు చేపడతామని హామీ ఇవ్వడంతో శాంతించారు. సభలో సభ్యులు ప్రస్తావించిన సమస్యలను సంబంధిత అధికారులు పరిష్కార మార్గం చూపాలని ఎంపీపీ ఆదేశించారు. జెడ్పీటీసీ కర్రి సత్యం మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్‌లకు తెలియజేయాలని, ఈ విషయంలో కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. వైస్ ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మీ, ఉగ్రాకుల గంగాభవానీ, తహసీల్దార్ ఎం. లక్ష్మి, ఎంఈవో సిహెచ్. రవీంద్రబాబు, ఏవో వై. కాంతమ్మ పాల్గొన్నారు.

పక్కా గృహాల నిర్మాణం ప్రారంభించండి



కె. వల్లాపురంలో జగనన్న లేఅవుట్‌ను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి ప్రభాకరరావు



పిండ్రంగిలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి నాగలక్ష్మి

మాడుగుల రూరల్: హౌసింగ్ డేను పురస్కరించుకుని కింతలి వల్లాపురంలో మండల ప్రత్యేకాధికారి జి. ప్రభాకరరావు శనివారం పర్యటించారు. ఇక్కడ జగనన్న లేఅవుట్‌ను పరిశీలించారు. ఈ లేఅవుట్‌లో 57 పక్కా గృహాలు మంజూరు కాగా, 16 ఇళ్లు ప్రారంభించగా, మరో 41 ఇళ్లు ప్రారంభించాల్సి ఉందని ఆయన తెలిపారు. వెంటనే లబ్ధిదారులు వాటిని ప్రారంభించాలని సూచించారు. ఎంపీడీవో మీనాకుమారి, హౌసింగ్ ఏఈ లెక్కల సత్యనారాయణమూర్తి, సర్పంచ్ తాళ్లపురెడ్డి రాంబాయి, మండల స్థాయి అధికార్లు, సచివాలయ సిబ్బంది, నాయకుడు తాళ్లపురెడ్డి రాంబాబు పాల్గొన్నారు.

కె.కోటపాడు: త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి తెలిపారు. హౌసింగ్ డే సందర్భంగా పిండ్రంగిలో శనివారం ఆమె ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడారు. ఇళ్ల నిర్మాణ దశను బట్టి బిల్లులు సకాలంలో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నామన్నారు. ఇక్కడ గ్రామ సచివాలయం,ఆర్బీకే, వెల్‌నెస్ భవన నిర్మాణలను పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని నిర్మాణదారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శచీదేవి, హౌసింగ్ ఏఈ రవిబాబు,ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అల్లు శ్వేత, ఏపీఎం వెంకటలక్ష్మి, ఎంఈవో మధుమూర్తి, సర్పంచ్ జాగరపు వెంకట రామలక్ష్మి, ఎంపీటీసీ నెక్కల గోపి పాల్గొన్నారు.

సత్రం భూములకు వేలం రేపు

బుచ్చెయ్యపేట: చిట్టియ్యపాలెంలో భమిడిపాటి వారి సత్రం భూములను మూడేళ్లపాటు కౌలుకు ఇస్తున్నట్లు దేవస్థానం ఈవో తెలిపారు. ఇక్కడ సర్వే నంబర్ 4ఎలో 4.96 ఎకరాల మెట్టు భూమి, సర్వే నంబర్ 4బిలో 4.96 ఎకరాల పల్లం భూమి, సర్వే నంబర్ 4సిలో 0.76 ఎకరాల మెట్టు భూమికి వేలం పాటను సోమవారం ఉదయం 11 గంటలకు చిట్టియ్యపాలెం రామాలయం వద్ద నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల రైతులు రూ.10 వేలు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. ఈ నెల 23న ఉదయం 11 గంటలకు చోడవరం మండలం నరసయ్యపేటలో సర్వే నంబర్ 301–1లో 2.06 ఎకరాల పొలాన్ని మూడేళ్లపాటు కౌలుకు ఇస్తున్నామని, రూ. 2 వేలు ధరావత్తు ముందుగా చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

సీపీఎం నాయకుడు సత్తిబాబు మృతికి సంతాపం



సత్తిబాబు(ఫైల్)

నర్సీపట్నం: సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.సత్తిబాబు గుండెపోటుతో శనివారం మృతి చెందారు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ముఠా కార్మిక సంఘం, మున్సిపల్ వర్కర్ యూనియన్లకు గౌరవాధ్యక్షుడిగా సేవలు అందించి నర్సీపట్నం ప్రాంతంలో చెరగని ముద్ర వేసుకున్నారు. సత్తిబాబు మరణంతో పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మీసాల సుబ్బన్న, ముఠా కార్మికులు, పారిశుద్ధ్య కార్మికులు ఆయన భౌతికాయానికి నివాళులర్పించారు. ఆదివారం అంతిమయాత్ర నిర్వహిస్తామని పార్టీ నాయకులు తెలిపారు.

సమస్యల పరిష్కారానికే జగనన్నకు చెబుదాం

నాతవరం: ప్రజా సమస్యల పరిష్కారానికి 'జగనన్నకు చెబుదాం' చక్కటి వేదికని తహసీల్దార్ పి.కనకారావు తెలిపారు. శనివారం ఆయన తన కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. స్పందన అర్జీలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించారు. జగనన్నకు చెబుదాం ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో పరిశీలించి ఇరువర్గాలతో చర్చించారు. వీటిపై క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులు తెలుసుకున్నప్పుడు బాధితులకు న్యాయం చేకూరుతుందన్నారు. ప్రత్యేకాధికారి జి.వి.లక్ష్మి, ఎస్‌ఐ డి.లక్ష్మీనారాయణ, ఎంపీడీవో యాదగిరీశ్వరరావు పాల్గొన్నారు.

సబ్సిడీపై బిందు, తుంపర సేద్యం పరికరాలు



మాట్లాడుతున్న జిల్లా సూక్ష్మ సాగు నీటి ప్రాజెక్టు డైరెక్టరు లక్ష్మి

నాతవరం: సబ్సిడీపై బిందు, తుంపర సేద్యం పరికరాల మంజూరుకు క్షేత్రస్థాయి పరిశీలన ఈ నెలాఖరు నుంచి చేస్తామని జిల్లా సూక్ష్మసాగు నీటి ప్రాజెక్టు డైరెక్టరు జి.వి. లక్ష్మి తెలిపారు. శనివారం ఆమె మండల ప్రత్యేకాధికారిగా విచ్చేసి స్థానిక అధికారులతో సమీక్షించారు. పలు అభివృద్ధి పనులపై చర్చించారు. జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులకు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ బిద్యం సేద్యానికి ఐదెకరాల లోపు భూమి కలిగిన రైతుకు 90 శాతం, అంతకు మించి ఉంటే 45 శాతం సబ్సిడీ ప్రభుత్వం ఇస్తుందన్నారు. తుంపర సేద్యానికి ఐదెకరాల లోపు భూమి ఉంటే 55 శాతం సబ్సిడీ, అంతకు మించి భూమి ఉంటే 45 శాతం కల్పిస్తుందన్నారు. బిందు, తుంపర సేద్యంతో కూలీలు సమస్య, ఎరువులు వినియోగం తగ్గుతుందన్నారు. ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు, హౌసింగ్ జేఈ జోగారావు, పంచాయతీ విస్తరణాధికారి ప్రేమలీల, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి

- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



సేవా వజ్ర అవార్డు పొందిన ఏసుకుమార్‌ను సన్మానిస్తున్న విప్ కరణం ధర్మశ్రీ, నాయకులు

రోలుగుంట: స్థానిక స్త్రీశక్తి భవన్‌లో శనివారం సాయంత్రం వలంటీర్ల వందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో వలంటీర్ వజ్ర, వలంటీర్ మిత్ర, వలంటీర్ సేవా రత్న అవార్డులకు ఎంపికైన 197 మందికి ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ శాలువాతో సత్కరించి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు, వారి సేవలు, ప్రజా ప్రయోజనాల గురించి ఆయన మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని వలంటీర్ల వ్యవస్థను ప్రజా ప్రయోజనాల కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేశారన్నారు. ఇప్పుడు దేశంలోనే ఈ వ్యవస్థ ఆదర్శంగా ఉందన్నారు. ఇంత గుర్తింపు రావడానికి వారి సేవలే కారణమన్నారు. రాబోయే రోజుల్లో ఈ సేవలు మరింత మెరుగ్గా అందించి గుర్తింపు పొందాలని సూచించారు. ఎంపీడీవో ప్రభాకరరావు, ఈవోపీఆర్డీ మల్లికార్జునరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

తిమిరాం చెరువుల్లో ఉపాధి పనులు

- క్షేత్రస్థాయిలో తహసీల్దార్ లక్ష్మి పరిశీలన



తిమిరాంలో చెరువును పరిశీలిస్తున్న తహసీల్దార్ లక్ష్మి

దేవరాపల్లి: తిమిరాంలోని ఎర్ర చెరువు, అడవి చెరువుల్లో కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పించాలని సంబంధిత సిబ్బందిని స్థానిక తహసీల్దార్ ఎం. లక్ష్మి ఆదేశించారు. శనివారం ఆమె క్షేత్ర స్థాయిలో పర్యటించి ఈ రెండు చెరువులను పరిశీలించారు. ఇక్కడ ఉపాధి పనులు చేపట్టకుండా ఆటంకం కలిగిస్తున్నారని ఇటీవల ఉపాధి కూలీలు నిరసన చేపట్టిన సంగతి తెలిసిందే. ఇక్కడ ఎటువంటి ఆటంకాలు లేవని, సోమవారం నుంచి రెండు చెరువుల్లో యథావిధిగా పనులు ప్రారంభించాలని ఉపాధి హామీ సిబ్బందికి ఆమె సూచించారు. సర్పంచ్ రెడ్డి సూర్యనారాయణ పాల్గొన్నారు.

మళ్లీ జగన్‌బాబే రావాలి

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు వద్ద వృద్ధుల అభిప్రాయం
- చినగోగాడలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం



మళ్లీ జగనే రావాలంటూ డిప్యూటీ సీఎం బూడికి చెబుతున్న వృద్ధురాలు

చీడికాడ: 'ఇంటి వద్దకే పింఛన్లు పంపించి మమ్మల్ని బతికించేది మా పెద్దకొడుకు జగన్‌బాబే' అంటూ పలువురు వృద్ధాప్య పింఛనుదారులు అభిప్రాయం వ్యక్తం చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం జి.కొత్తపల్లి శివారు చినగోగాడలో ఇంటింటికీ వెళ్లిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు వద్ద పై విధంగా స్పందించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిరుపేదలకు సత్వర న్యాయం చేయాల్సిన బాధ్యత మనపై ఉందని గ్రామ సచివాలయ ఉద్యోగులకు, వలంటీర్లకు సూచించారు. సాంకేతిక కారణాలతో నిలిచిన పింఛన్లు పునరుద్ధరించాలని ఆదేశించారు. ఇళ్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. జలజీవన్ మిషన్‌లో భాగంగా 30 వేల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకు నిర్మాణానికి, ఇంటింటి కుళాయిల ఏర్పాటుకు రూ.52 లక్షల కేటాయించామన్నారు. ఇప్పటికే 210 కుళాయిల ఏర్పాటు ద్వారా తాగునీరు సరఫరా అవుతుందన్నారు. అనంతరం ఉపాధి పనుల్లో గాయపడిన మహిళను పరామర్శించి వైద్య ఖర్చులకు సాయం అందించాలని అధికారులను ఆదేశించారు. రూ.4.05 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. గ్రామంలో 737 మందికి వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.2.47 కోట్ల లబ్ధి కలిగిందన్నారు. నూతనంగా ప్రారంభించిన అంగన్‌వాడీ భవనం శ్లాబ్ నుంచి వాటర్ లీకేజీలున్నందున సరిచేయాలని అధికారులను ఆదేశించారు. ఎంపీపీ కురచా జయమ్మనారాయణమూర్తి, జెడ్పీటీసీ లాలం శారదాజానకీరాం, సర్పంచ్ కొల్లి సూరినాయుడు, ఎంపీటీసీ కొల్లి నాగమణి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, విశాఖ డెయిరీ డైరెక్టర్ శీరం రెడ్డి సూర్యనారాయణ, మండల సచివాలయాల కన్వీనర్ ఈర్లె చైతన్య, చినగోగాడ సీనియర్ నేతలు కొల్లి శ్రీను, పుట్టా రాంకుమార్, అదప్రావు రామారావు, విస్సారపు శ్రీను, ప్రగడ సాయి, కోన సత్తిబాబు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట

- బెన్నవోలులోని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



బెన్నవోలులో మహిళలతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: అర్హులకు సంక్షేమ పథకాలు అందించి, అన్ని వర్గాల ప్రజలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా నిలుస్తోందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బెన్నవోలులో శనివారం ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగా క్షేమాలను, సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ మూడెడ్ల శంకరరావు స్థానిక సమస్యలను ధర్మశ్రీ దృష్టికి తీసుకొచ్చారు. అభివృద్ధి పనులకు రూ.10 లక్షలు అక్కడికక్కడే మంజూరు చేశారు. దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు స్థానంలో కొత్తవి వేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మంచినీటి సమస్య పరిష్కారానికి ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మిస్తున్నామన్నారు. పెద్దేరుపై కాలిబాట వంతెన కోసం స్థానికులు కోరగా, వంతెన మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, తహసీల్దార్ తిరుమలబాబు, ఎంపీడీవో చైతన్య, ఉప సర్పంచ్ మజ్జి రమణ, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కంచిపాటి రమేష్, కంఠంరెడ్డి రామారావు, మొల్లి గోవింద, సచివాలయ కన్వీనర్ మూడెడ్ల సుధీర్, మజ్జి సత్యవేణి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ మిట్టా రమణబాబు, నూకరాజు పాల్గొన్నారు.

వెలంకాయలపాలెంలో....

రోలుగుంట: కొండపాలెం శివారు వెలంకాయలపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ శనివారం సాయంత్రం ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు ఆదేశించారు. ప్రభుత్వ పథకాలు గురించి వివరించారు. ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ టి.వి.రమణ, పార్టీ అధ్యక్షుడు మడ్డు అప్పలనాయుడు, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పోతల లక్ష్మీశ్రీనివాస్, మాజీ సర్పంచ్ బంటు సూర్యసన్యాసిదేముళ్లు, నాయకుడు బెజవాడ సన్యాశినాయుడు, అధికారులు కె.ప్రభాకర్రావు, హెచ్.త్రివేణి, సూర్యకుమారి, ప్రేమానందం, నాయకులు కుంచంగి హరిబాబు, రామన్, రామకృష్ణ, కృష్ణంనాయుడు, చిటికెల వెంకటసత్తిబాబు పాల్గొన్నారు.

25 నుంచి కె.జె.పురంలో 'గడప గడపకు'

మాడుగుల రూరల్: కె.జె.పురంలో ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు చేపట్టే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పంచాయతీ కార్యదర్శి పెంకి శివ తెలిపారు. శనివారం స్థానిక గ్రామ సచివాలయంలో గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలతో ఆయన మాట్లాడారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఇంటింటికీ తిరిగి సంక్షేమ లబ్ధి గురించి వివరిస్తారన్నారు. సర్పంచ్ జామి రమణబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు కాళ్ల రాము, నాయకులు ఆడారి కన్నారావు, మళ్ల కన్నబాబు, కాళ్ల అప్పలనాయుడు పాల్గొన్నారు.